# తలుపులు

పన్నీటి జల్లు కురిసినట్టుంది గతరాత్రి. ఆ పరిమళపు మార్దవం ఒత్తుగా హత్తుకొని వుండగానే రోజువారీ పనులు మొదలు పెట్టాను.

ఇల్లు చిమ్మటం, పనమ్మాయి తోమిన గిన్నెలు సర్దటం, కాఫీ కలపటం, వదిన, అక్క, తమ్ముని పిల్లలకి జడలు వేయటం. రోజూ చేస్తున్నపనే కానీ అసలు పని చేస్తున్నట్టే లేదు.

అవును, రాత్రంతా ఆకాశాన్నీ, చందమామనీ, నక్షత్రాలనీ చూస్తూ, మల్లెమరువపు పరిమళాలను ఆస్వాదిస్తూ నేనూ, శశాంక ఎన్నెన్ని కబుర్లు చెప్పుకున్నాం.ఐదారు పాటలు కూడా పాడు కున్నాం.

ఏం మాట్లాడుకున్నాం?

ఫిలాసఫీ ఆఫ్ ఈస్తటిక్స్, యోగా, స్త్రీవాదం, నేషనల్ ఫిలిం అవార్డ్స్, చికెన్ మంచూరియా, రాఫెల్ మాటలు, దళిత సాహిత్యం, జురాసిక్‌పార్కు- ఒకటా రెండా? ఒకదానికి మరోదానికి పోలికా? పొంతనా? అయినా మాట్లాడుకున్నాం. రాత్రులు దీర్ఘమా? సుదీర్ఘమా? శశాంక వుంటే జీవితం గంటలు - ఘడియలుగా తోచదు.

కాని ఇప్పుడేమయింది?

ఎన్నెన్ని మాటలు! ఎన్నెన్ని నిరసన చూపులు? ఎంత గొడవ! ఎంత అసహ్యం!

వీటి స్థాయిలో తేడాయే తప్పా ఇవేవీ నాకు కొత్తకాదు.

కాలేజి చదువు చెప్పించకుండానే అక్కకి పెళ్ళి చేసేశారు. మా ఇంట్లో కాలేజీకి వెళ్ళిన మొదటి అమ్మాయిని నేనే. ఆడపిల్లల కాలేజి మా ఇంటికి దూరం అయినా ఆ కాలేజిలోనే చేర్పించారు. ఇంట్లో వాళ్ళంతా పట్టుపట్టి....! మా వీధి నుంచి కాలేజికి వెళ్ళే అమ్మాయిలందరిలో సరళ తోడు నాకు నచ్చింది. 'అప్పుడే వచ్చేశామా' అన్నంత తేలిగ్గా కాలేజికి సరళ కబుర్లతో వచ్చేసేదాన్ని.

ఒకరోజు సాయంత్రం బోటనీ రికార్డు పని చేసుకుంటుంటే "నువ్వు ఆ సరళతో వెళతావేం కాలేజికి" అడిగాడు అన్న.

సరళతో వెళ్తే అన్నకి ఏం ఇబ్బందో అర్థంకాక "ఏం" అని అడిగాను.

"సరళతోనే ఎందుకు వెళ్ళాలి? ఇంకా ఈ వీధిలో చాలా మంది మీ కాలేజి వాళ్ళు వున్నారుగా" అన్నాడు అన్న.

"సరళతో ఎందుకు వెళ్ళకూడదు?" అడిగాను.

"ఏంటా మొండితనం? వాడికి ఇష్టం లేదు. మానెయ్యరాదూ!" కోపంగా అంది అమ్మ.

"ఎందుకు ఇష్టం లేదో చెప్పొచ్చుగా"

"ఎందుకంటే? అది మగవాళ్ళతో మాట్లాడుతుంది. దాని వల్ల నీకు చెడ్డపేరు వస్తుంది" అన్నాడు అన్న.

"మగవాళ్ళతో మాట్లాడితే ఏం" అన్నానో లేదో "చూడు దీనికి అప్పుడే

దాని పైత్యం వంటబట్టింది. రేపటినుంచీ కవితతో కలసి కాలేజీకి వెళ్ళు. లేదా చదువు మానేసి ఇంట్లో కూర్చో" అన్నాడు అన్న.

అమ్మ అన్నకి తాళం వేసింది. ఫలితంగా సరళతో నా స్నేహం ఆగిపోయింది. కవితతోనే నేను కాలేజీకి వెళ్ళాల్సి వచ్చింది.

కవిత మానసికంగా, శారీరకంగా హుషారుగా వుండదు. ఆమెతో కాలేజ్‌కి వెళ్ళటం కంటే మానేసి ఇంట్లో కూర్చోవటం మేలనిపించింది. పోనీ నేను ఒక్కదాన్ని వెళతానన్నా ఇంట్లో ఒప్పుకోరు. సరళతో మాట్లాడాలనిపించినా ఇంట్లో వాళ్ళకి బెదిరి మాట్లాడేదాన్ని కాదు. అలా ఇంటర్మీడియట్ పూర్తి అయింది.

మా వూళ్ళో ఆడపిల్లలకి డిగ్రీ కాలేజి లేదు. కో ఎడ్యుకేషన్. లక్షా తొంభై జాగ్రత్తలు చెప్పి కాలేజిలో చేర్పించారు.పెళ్ళి కొడుకులు 'చదువుకున్న అమ్మాయి కావాలంటున్నారు' కనుక చదివిస్తున్నారు కానీ వూరికే చదివిస్తారా? థాంక్స్ టూ పెళ్ళి కొడుకులు!

ఇంట్లో వద్దన్నారని మేం అబ్బాయిలతో మాటలు మానేస్తామా? అలాగని ఏ అరమరికలూ లేకుండా హాయిగా కబుర్లు చెప్పుకునేట్టు లేదు కాలేజి వాతావరణం.

మా అందరిలోకి జయ హుషారుగా వుండేది. జయ తండ్రి ప్రభుత్వోద్యోగి. ఇంతకు ముందు బెంగుళూరులో చదువుకున్న జయ, తండ్రి ట్రాన్స్‌ఫర్ వల్ల ఈ వూరువచ్చి ఈ కాలేజిలో జాయిన్ అయింది.

జయ అందరితో కలివిడిగా వుండేది. ఆమె ముందు నవ్వుతూ మాట్లాడే అబ్బాయిలలో చాలా మంది ఆమె వెనక ఆమెని గురించి చాలా తేలిగ్గా 'లైన్ వేస్తుంది గురూ' అనేవారు.

శ్రీవాత్సవ్ మాత్రం ఆమెని ఏం అనేవాడు కాదు. ఇష్టంగా వుండేవాడు. ఒకరోజు జయ, నేను, కళ్యాణి సినిమాకి వెళుతున్నాం. జయ శ్రీవాత్సవ్‌ని సినిమాకి రమ్మని పిలిచింది.

"రాను" అన్నాడు.

"ఏం" అడిగింది జయ.

అతను జవాబు చెప్పలేదు.

జయ రెట్టించి అడుగుతోంటే "ఎవరైనా చూస్తే బాగుండదు" అన్నాడు శ్రీవాత్సవ్.

"మనకి ఇష్టమైన సినిమాకి వెళితే ఎవరికో ఎందుకు బాగుండాలి? బాగుండకపోతే నష్టం ఏంటి?ఏయ్ నీకు అసలు మన స్నేహం ఇష్టమా కాదా" నిలదీసింది జయ.

"ఇష్టమైతే మరొకరి గురించి భయపడటం దేనికి?"

"అది కాదు. నలుగురూ ఏమైనా అనుకుంటారు" ముఖమంతా ఎర్రగా అయిపోతుంటే అన్నాడు శ్రీవాత్సవ్.

"రఘు ఇలానే అంటాడు" చప్పున అంది కళ్యాణి.

"స్త్రీ పురుషుల మధ్య స్నేహం బాగుంటుందని, అదేం తప్పుకాదని వీళ్ళకి తెలుసు.ఆ స్నేహమూ కావాలి. సోకాల్డ్ మర్యాదస్తుల మనిపించుకోవాలనే దుగ్ధ వుంది. మనకి సంతోషాన్ని ఇచ్చేది ఏదైనా పొందాలనుకున్నప్పుడు పొందడానికి తపన ఒక్కటే సరిపోదు. ధైర్యం కావాలి. ఈ రోజుకి ఆడామగా కలసి సినిమాకి వెళ్ళటం కొత్తగా వుండొచ్చు. వెళ్ళటం మనకి ఇష్టం అయినప్పుడు వెళితే కొన్నాళ్ళకి ఇది కొత్తగా అనిపించకపోవచ్చు. మన గురించి నలుగురు అనుకుంటే నష్టం ఏంటంటా" అంది జయ.

అయినా శ్రీవాత్సవ్ రాలేదు. మేం ముగ్గురం సినిమాకి వెళ్ళాం.

అమ్మతో ఇష్టంలేని పేరంటానికి వెళ్ళి ఇంట్లోకి వస్తుంటే జయ వాళ్ళ అన్నయ్య శశాంక కనిపించాడు.

"ఏంటి ఇటు వచ్చారు? రండి. ఇదే మా ఇల్లు" అన్నాను.

"జయ మీ జువాలజి రికార్డ్ తీసుకుందంటగా. తనకి ఒంట్లో కాస్త బాగులేదు. రేపు కాలేజికి రాకపోవచ్చు. రికార్డ్ లేకపోతే మీకు ప్రాక్టికల్స్ ఇబ్బందని నన్ను ఇచ్చి రమ్మంది" అన్నాడు.

అతను అందిస్తున్న రికార్డ్‌ని నా కంటే ముందు అమ్మ అందుకుంది. అతని ముందే పేజీలని తిప్పి అందులో ఎటువంటి కాగితాలు లేవని

నిర్ధారించుకొని నాకు ఇచ్చింది. నా తల నేలకి వాలిపోయింది.

అతనిని బలవంతంగా ఇంట్లోకి పిలిచి కూర్చోమని అతనికి చేరువగా కుర్చీ లాక్కొని కూర్చుని అతని పుట్టుపూర్వోత్తరాల గురించి అడిగి వూదర కొట్టేసింది. అతను వున్నంతసేపు నా చూపులు నేలపైనే వున్నాయి.

"ఎప్పట్నుంచీ ఆ కుర్రాడు తెలుసు? జయతో తిరగొద్దు. మాట్లాడొద్దు. ఇలా అబ్బాయిలు నీకోసం ఇంటికి వస్తే పరువేం కావాలి" ఇప్పటికీ మరదళ్ళపై జోకులువేసే నాన్న పాఠం చెప్పాడు.

"పెళ్ళయ్యాక మనలని పెద్దగా పట్టించుకోరులే. అబ్బాయిలతో మాట్లాడకు. ఆ జయ ఇంటికి వెళ్ళకు" అంది అక్క.

అసలు గొడవంతా పెళ్ళయిన మూడో రోజే మొదలయింది.

నా స్నేహితులందరికీ శ్రీరామ్‌ని పరిచయం చేశాను. శ్రీరామ్ అందరినీ చురుగ్గా పలకరించాడు.

"పెళ్ళి కొడుకు చాలా హుషార్" అనగానే సంతోషం వేసింది.

శ్రీరామ్ తన స్నేహితులందరినీ పరిచయం చేశాడు.

'హలో' అంటే 'హలో' అని, 'నమస్తే' అంటే 'నమస్తే' అన్నాను.

ఆ రాత్రి శ్రీరామ్ నన్ను దగ్గరికి తీసుకుంటూ "నువ్వు అమ్మాయిల కాలేజీలో చదువుకోలేదా" అడిగాడు.

"ఏం" అన్నాను.

"అసలు సిగ్గుపడకుండా కలివిడిగా మగవాళ్ళని పలకరించడం నీకు ఎలా వచ్చింది?" అడిగాడు శ్రీరామ్.

"సిగ్గుపడటం ఏంటి?"

"సాయంత్రం నా ఫ్రెండ్స్‌ని పరిచయం చేస్తే తలెత్తి మరీ పలకరించావుగా" వ్యంగ్యంగా అన్నాడు శ్రీరామ్.

అందులో సిగ్గుపడాల్సిన విషయం ఏముంది? అతను నా స్నేహితులందరితో బాగా మాట్లాడితే నాకు సంతోషంగా అనిపించిందే. అటువంటి సంతోషం శ్రీరామ్‌కి ఎందుకు కలగలేదు? పైగా అయిష్టం,

ఎందుకని?

అంటే అతనూ నా స్నేహాలనీ, బంధాలనీ, అనుబంధాలనీ శాసించ బోతున్నాడా?

శాసించటం ఏంటి? శ్రీరామ్‌కి వివరించాలి. అర్థం అయేట్టు చెప్పాలి. ఇష్ట మయిన స్నేహాలు వదులుకోవటం ఎంత కష్టమో, ఇష్టంలేని స్నేహాలు చేయటం అంతే కష్టమని చెప్పాలి. ఆలోచిస్తూ పరధ్యానంగా అతని మెడ చుట్టూ చేతులు వేశాను.

"నువ్వు చాలా ఫాస్ట్. కొత్తగా పెళ్ళయిన ఆడవాళ్ళు ఇంత చనువుగా ఉంటారా? పుస్తకాల ప్రభావమా? సినిమాల పైత్యమా? లేక...." అదోలా నవ్వుతూ అడిగాడు శ్రీరామ్.

నా చేతివేళ్ళే కాదు శరీరంలో ఒక్క కణం కూడా కదలకుండా బిగుసుకుపోయాను. ఆ తర్వాత ఎప్పుడూ నాలో చలనం లేదు.

◆◆◆

శ్రీరామ్ "సినిమాకి వెళదాం" అన్నాడు.

సినిమాకా? శ్రీరామ్‌తో బయటికి వెళ్ళాలంటే చికాకు. అటూ ఇటూ ఎటు చూసినా సతాయింపే. సినిమాలో నవ్వు వస్తే నవ్వకూడదు.

"ఆడదానివి ఏంటి అంత గట్టిగా నవ్వుతున్నావ్" అంటాడు.

నాన్నతో సినిమాకి వెళ్ళినపుడు ఇంటిల్లిపాదిమీ ఇలానే బిగుసుకు పోయి సినిమా చూసే వాళ్ళం.

సినిమాకి రానన్నా ప్రమాదమే.

ముస్తాబై శ్రీరామ్ వెంట వెళ్ళాను.

ఇంటర్వెల్ లో "హాయ్ బావ" అంటూ చలాకీగా శ్రీరామ్‌ని పలకరించి నా వేపు తిరిగి "నా పేరు సుజాత. శ్రీరామ్ మేనత్త కూతుర్ని. ఇతను విక్రమ్. శ్రీవారు" అంది. ఈ అమ్మాయిని పెళ్ళిలో చూసిన గుర్తే లేదు.

ఆ మాటే అంటే "పెళ్ళికి పిలవలేదు. కులాంతర వివాహం

చేసుకున్నానని కోపం" నవ్వుతూ అంది సుజాత.

శ్రీరామ్ సుజాతని సరిగ్గా పలకరించలేదు.

సుజాతని చూడగానే జయ గుర్తువచ్చింది. అదే చలాకితనం.

ఆ విషయం సుజాతకి చెప్పాను. సంతోషంగా నవ్వింది.

◆◆◆

పక్కింటి శకుంతల షాపింగ్‌కి వెళుతూ నన్ను తోడు పంపించమని అడిగితే మా అత్తగారు సంతోషంగా ఒప్పుకుంది. ఇంతకు ముందు ఒకసారి శకుంతల షాపింగ్‌కి తీసుకెళ్ళింది.

ఆవిడకి ఓ పట్టాన ఏ చీరా నచ్చదు. షాపతను ఎన్నిచూపించినా ఇంకా ఇంకా చూపించమనేది. షాపతనికి విసుగొచ్చి "ఇంకేం లేవండి" అనేవాడు. అంతే రుసరుస లాడుతు పక్క షాపుకి తీసుకువెళ్ళేది. అక్కడా ఇదే తంతు! షాపు వాళ్ళు 'కొనే రకం' కాదని గ్రహించగానే వాళ్ళలో వాళ్ళు నవ్వుకునేవారు. నాకు ఈవిడ వరస చెప్పరానంత విసుగ్గా అనిపించింది. అటువంటి శకుంతలగారితో తిరిగి షాపింగ్‌కి వెళ్ళాలంటే ముందే తలనొప్పిగా వుందేమో అది కాస్త పెరిగింది.

"తలనొప్పిగా వుంది అత్తయ్యా, వెళ్ళను" అన్నాను.

"పంపిస్తానని చేప్పేశాను. ఇప్పుడు నువ్వు వెళ్ళనంటే నువ్వు నా మాట వినవని ఈవీధి వీధంతా చెప్పుకుంటారు,వెళ్ళు. ఏదైనా బిళ్ళ మింగు" అన్నారావిడ.

తప్పనిసరిగా శకుంతల గారితో షాపింగ్‌కి బయలుదేరాను. ఆ షాపు ఈ షాపు ఈవిడ తిప్పే క్రమంలో సుజాత కనిపించింది.

"రా. అక్కా! ఇక్కడే, ఈ పక్కనే మా ఇల్లు" అంది సుజాత.

"శకుంతలగారూ...."

"ఆవిడ చీరల బేరం సాయంత్రం దాకా తెమలదులే" అని ఆవిడ దగ్గరికి వెళ్ళి "మా ఇంటికి రండి" అంది సుజాత.

"చీరలు చూస్తున్నానుగా. మరోసారి వస్తానులే" అన్నారామె.

"అక్కని తీసుకువెళ్ళి అరగంటలో ఇక్కడ వదిలేస్తాను" అంది సుజాత.

"నాతో షాపింగ్‌కి వచ్చింది. మరోసారి తీసుకువెళ్ళు" అంది శకుంతల.

"చాలా పెద్ద షాపుగా. చూస్తుండండి. మేం ఇప్పుడే వస్తాం. మేం వచ్చేవరకూ ఆవిడకి మీ షాపు మొత్తం చూపించండి" సేల్స్ బోయ్స్‌తో చెప్పి నన్ను వాళ్ళింటికి తీసుకువెళ్ళింది.

సుజాత ఇల్లు నీట్‌గా వుంది. ఆమె దగ్గర మంచి లైబ్రరీ వుంది. సుజాత కాఫీ చేసి ఇచ్చింది. తాగి నాలుగు పుస్తకాలు తీసుకొని ఆ ఇంట్లో నుంచి రాలేక రాలేక బయటికి వస్తుంటే "డిగ్రీ చదివావుగా, ఏదైనా వుద్యోగం చేయరాదూ" అంది సుజాత.

"అడిగాను. మీ బావ ఒప్పుకోలేదు" అన్నాను.

"పట్టుపట్టి జాయిన్ అవ్వు. ఉద్యోగం చూసిపెడతాను" అంది సుజాత.

ఇద్దరం షాపుకి వెళ్ళేసరికి శకుంతలగారు సగం షాపు మాత్రమే చూశారు.

'నే చెప్పలేదూ' అన్నట్టు నవ్వింది సుజాత.

షాపింగ్ విశేషాలు ఇంట్లోవాళ్ళు అడిగితే చెపుతూ చెపుతూ సుజాత కనిపించిన విషయం చెప్పాను.

ఆ రాత్రి శ్రీరామ్ పేపర్ తిరగేస్తున్నాడు.

సుజాత దగ్గర నుంచి తీసుకొచ్చిన పుస్తకాల్లోంచి 'కలకత్తాకి దగ్గరలో' చదవటం మొదలు పెట్టాను.

"సుజాత ఇంటికి వెళ్లావా" అడిగాడు శ్రీరామ్.

"వూ. ఈ పుస్తకం తనదే" అన్నాను.

"ఎందుకెళ్ళావ్"

"ఏం"

"తనకి మా కుటుంబంతో సంబంధాలు ఎప్పుడో తెగిపోయాయి. ఇప్పుడు తిరిగి యిలా నువ్వెళ్లటం ఏం బాగుంటుంది" అన్నాడు.

"బట్ సుజాత నాకు నచ్చింది"

"నీకు నచ్చినా సరే. ఈ ఇంటివాళ్ళకి పడనివాళ్ళతో రాకపోకలు కుదరవ్" నిక్కచ్చిగా చెప్పేసాడు.

◆◆◆

చెల్లాయిపెళ్ళి నిశ్చయమయింది. శ్రీరామ్ అమ్మవాళ్ళింటికి పంపించాడు.

వేసవి సెలవలేమో ఇల్లంతా పిల్లల సందడి.

వో రోజు సాయంత్రం పెరట్లో పూసిన మల్లెమొగ్గలు కోస్తుండగా శశాంక వచ్చాడు.

చాల కాలానికి కనిపించాడేమో యిప్పుడు అమెరికాలో వుంటున్న జయ కబుర్లు, తన విషయాలు, మా విషయాలు మాట్లాడుతున్నాం.

అలా మాట్లాడుతుండగానే ఎనిమిది అయింది. శశాంక వెళతానని బయలుదేరితే భోజనం చేసి వెళ్ళండి అన్నాను. అమ్మ అయిష్టాన్ని దాచుకొని వడ్డించింది. నాన్నగారు, అన్న పెళ్ళి పనులపై పొరుగూరు వెళ్ళారు.

"ఎక్కడున్నారు మీరు" అడిగాను

"ఇప్పుడు వెళ్ళి ఏదైనా హోటల్లో రూమ్ తీసుకోవాలి" అన్నాడు శశాంక.

"ఇప్పుడు వెళ్ళి తీసుకోవాలా? అన్నయ్య గది ఖాళీగానే వుంది. ఇక్కడే పడుకోండి" రవంత ఆలోచనా, తడబాటూ లేకుండా అనేశాను.

శశాంక ముందు మొహమాటపడ్డాడు. నేను రెట్టించి అడిగేసరికి సరేనన్నాడు.

"అదేంటి ఆ అబ్బాయిని అలా వుండమన్నావ్" పక్కకి పిలిచి అమ్మ అడిగింది.

"రేపు వెళ్ళిపోతారులే. అన్న వైజాగ్ వెళ్ళినపుడు జయ వాళ్ళ నాన్నగారు చాలా సాయం చేశారు. గుర్తులేదా" అన్నాను. స్నేహాలు చేయటానికి అభ్యంతరాలు కాని సహాయం పొందటానికి అభ్యంతరాలు లేవు ఇంట్లో ఎవ్వరికీ!

అమ్మకి మరో మాట మాట్లాడటానికి అవకాశం ఇవ్వకుండా శశాంక దగ్గరికి వెళ్ళాను.

"ఈ గదిలో కంటే డాబా మీద పడుకోవటం ఇష్టం" అన్నాడు.

చాప, దిండు తీసుకుని మేడ మీదకి వెళ్ళాం. అప్పటికే చిన్న చెల్లాయీ, తమ్ముడూ, అక్క పిల్లలూ పక్కలు వేసుకుని వున్నారు. శశాంకకి పక్క వేశాను.

నిద్ర వచ్చేవరకు మాట్లాడుతూ కూర్చున్నాం. చూస్తుండగానే తెల్లారిపోయింది.

ఇదిగో ఈ ఉదయం ఆ పరిమళపు మార్ధవం ఒత్తుగా హత్తుకొని వుండగానే ఇంట్లో గొడవ మొదలయింది.

"బోల్డంత పని పెట్టుకొని పరీక్షలకి నైట్ అవుట్ చేసినట్టు కబుర్లకి నైట్ అవుట్లేంటి" కసురుకున్నాడు తమ్ముడు.

"ఏంటి మరీ ఇంత బరితెగించిపోతున్నావ్" గయ్‌మంది అమ్మ.

"మా ఇంట్లో మగవాళ్ళ వేపు కన్నెత్తి కూడా చూడనివ్వరు" అంది వదిన.

"మీ ఆయనకి తెలిస్తే ఎంత గొడవ! నీకు మా మాటలు రుచించకపోయినా పర్లేదు. మా మాట వినకపోతే వెంటనే మీ అత్తగారింటికి వెళ్ళిపో. అక్కడ నీ ఇష్టం. వాళ్ళ ఇష్టం. మధ్యలో మాకు మాట తీసుకురాకు" ఊరు నుంచి వచ్చిన నాన్న స్పష్టంగా చెప్పేశారు.

"అయినా రాత్రంతా మాట్లాడుకునేటన్ని కబుర్లు ఏం వుంటాయి! పైత్యం కాకపోతే" అన్నాడు అన్న.

ఒకే ఇంట్లో పుట్టి పెరిగిన నా అనుకున్న ఈ మనుష్యులకీ, అన్ని బేరాలతో నా జీవితంలోకి వచ్చిన ఆ మెట్టింటి వాళ్ళకి ఏమైనా తేడా వుందా?

శ్రీరామ్ కుటుంబం కోసం చేస్తున్న చాకరీలో, స్నేహాలలో నాకు ఆనందం లేదు.

అక్కరలేని బంధాలనీ, సంతోషం ఇవ్వని స్నేహాలనీ ఎంత కాలం

మోయాలో?

"ఏంటా వరదాచారితో కబుర్లు" నాన్నమ్మని కసురుకుంటున్నాడు తాతయ్య.

స్నేహానుబంధాలపై కట్టడి కట్టి వున్నంత వరకు పోదా?

నో...అలా ఎలా వుండటం? ఆ రాత్రి బోల్డన్ని కబుర్లతో సుజాతకి పుత్తరం రాసాను.



